సాక్షి కర్నూలు

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



శ్రీమఠానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం: శ్రీమఠానికి గురువారం భక్తులు పోటెత్తారు. తుంగభద్రలో స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి పూజలు నిర్వహించారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్యకళావేదికపై గురువారం విశాఖపట్నంకు చెందిన కె.సునీత, బృందం సభ్యులు భక్తి గీతాలకు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,630.60
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 96.305
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,469
అవుట్ ఫ్లో	: 6,706

న్యూస్‌రీల్

సమన్వయంతో వలసలు నివారిస్తాం

● డ్వామా పీడీ వెంకటరమణయ్య వెల్లడి



పీడీకి అభినందనలు తెలుపుతున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఫీల్డ్ అసిస్టెంటు మొదలు కొని జిల్లా స్థాయి వరకు అందరం సమన్వయంతో పనిచేసి వలసలను నివారిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటరమణయ్య అన్నారు. ఎంపీడీవోగా 22 ఏళ్ల పనిచేశానని, ఉపాధి పనులపై పూర్తి అవగాహన ఉందని, జిల్లాలో మరింత పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ఆయనను జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించడంతో గురువారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలసి పూల బొకే అందజేశారు. నూతన పీడీని అదనపు పీడీని మాధవీలత, పరిపాలన అధికారి విజయలక్ష్మి, ఫైనాన్స్ మేనేజర్ ఆదెయ్య, ఏపీడీలు, వాటర్‌షెడ్ అధికారులు తదితరులు కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.

గుండ్రేవుల పరిశీలన



తుంగభద్ర నదిని పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు (సిటీ): సి.బెళగల్ మండలం గుండ్రేవుల సమీపంలోని తుంగభద్ర నదిని కర్నూలు ప్రాజెక్ట్ సీఈ కబీర్ బాషా, కర్నూలు సర్కిల్ ఇన్‌చార్జి పర్యవేక్షక ఇంజనీర్ బి.బాలచంద్రారెడ్డి, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, డీఈ ప్రసాద్‌రావు గురువారం పరిశీలించారు. గుండ్రేవుల దగ్గర 20.15 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని కేసీ ఆయకట్టు రైతులు, పశ్చిమ పల్లె ప్రజలు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తామని ఎలాంటి డిజైన్స్ లేకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత అంతర్‌రాష్ట్ర ప్రాజెక్టుగా మారడంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం ముందుకు కొనసాగలేదు. అయితే ఈ రిజర్వాయర్ నిర్మాణ అంశంపై ప్రస్తుతం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు గుండ్రేవుల నిర్మాణంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీంతో స్పందించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రిజర్వాయర్ నిర్మాణం కోసం మళ్లీ అంచనాలను వేసేందుకు అధికారులు మరోసారి గుండ్రేవుల రిజర్వాయర్ ప్రతిపాదన ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలుస్తోంది.

ఎల్లెల్సీకి మార్చి 31 వరకు నీటి విడుదల

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు వచ్చే ఏడాది మార్చి 31 వరకు సాగు నీరు విడుదల చేసేందుకు ఆ రాష్ట్ర నీటి సలహా మండలి నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని టీబీ బోర్డు అధికారులు వెల్లడించారు. గురువారం బెంగళూరులోని వికాస సౌదలో సాగు నీటి సలహా మండలి(ఐసీసీ) సమావేశం నిర్వహించారు. రబీ సీజన్ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన ఈ సమావేశంలో ఆంధ్ర అధికారులు తమ కోటాలో ఎంత మేర నీరు కావాలో ఇండెంట్ పెట్టిన తర్వాత పరిశీలించి విడుదల చేయాలని నిర్ణయించారు.

శ్రీశైల దేవస్థానం పర్యవేక్షకుడిపై సస్పెన్షన్ వేటు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని అన్నప్రసాద వితరణ విభాగంలో పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న సి.మధుసూదన్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. బుధవారం మధ్యాహ్నం భక్తుడి మాదిరిగా దేవస్థాన ఈఓ చంద్రశేఖర ఆజాద్ అన్నప్రసాద వితరణ భవనానికి చేరుకుని భక్తులతో పాటు కలిసి భోజనం స్వీకరించారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సూచించిన దిట్టం మేరకు ఆహార పదార్థాలు వడ్డించడం లేదని గమనించారు. అంతేకాకుండా స్వామి అమ్మవార్ల దర్శనార్థమై వచ్చే భక్తులకు సరిపడ కూరలు, పప్పు, అన్నప్రసాద వితరణలో జరిగేటట్లు చూసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని తనిఖీలో వెలుగులో చూసింది. అలాగే సాధారణ రోజుల్లో, రద్దీ రోజుల్లో క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు సరిపడ భోజన పదార్థాలు తయారు చేయించడంలో విఫలమయ్యారని బయటపడింది. ఈ నేపథ్యంలో అన్నప్రసాద వితరణ విభాగం పర్యవేక్షకులు సి.మధుసూదన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ శ్రీశైల దేవస్థాన ఈఓ చంద్రశేఖర ఆజాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీమకు శాశ్వత అన్యాయం



ఊహించిందే జరుగుతోంది! రాయలసీమ మరోసారి మోసపోతోంది!! ఏడు దశాబ్దాలుగా 'సీమ'కు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతూ హక్కుగా రావాల్సిన హైకోర్టు ఏర్పాటు దిశగా గత సర్కారు అడుగులు వేస్తే.. కూటమి సర్కారు తాజాగా 'బెంచ్' మాత్రమే ఏర్పాటు చేయనున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేసింది. దీంతో హైకోర్టు రాకతో కర్నూలు న్యాయ రాజధాని అవుతుందనుకున్న 'సీమ' వాసుల ఆశలు అడియాశలయ్యాయి. సీమ ప్రాంతానికి చెందిన 45 మంది ప్రజాప్రతినిధులు, సీఎం, ఏడుగురు మంత్రులున్న అసెంబ్లీ సాక్షిగా మరోసారి ద్రోహం తలపెట్టారు.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

కర్నూలులో హైకోర్టు బెంచ్ నెలకొల్పేందుకు ఆమోదం తెలియచేస్తూ శాసనసభ గురువారం తీర్మానం చేసింది. హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానాన్ని నంద్యాల వాసి, మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ స్వయంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాయి. హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో 'సీమ'కు మేలు జరుగుతుందని కూటమి నేతలు నమ్మబలుకుతుండటంపై 'సీమ' వాసులు, న్యాయవాదులు మండిపడుతున్నారు. ముక్తకంఠంతో తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నారు. బెంచ్ ఏర్పాటుకు కూటమి సర్కారు ఆమోదం తెలపడమంటే సీమలో హైకోర్టు ఆశలకు శాశ్వతంగా దూరమైనట్లేనని హెచ్చరిస్తున్నారు.

పెద్ద మనుషుల ఒప్పందం గాలికి..

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు అనేది రాయలసీమ హక్కు అని నిపుణులు, న్యాయ కోవిదులు పేర్కొంటున్నారు. తమిళనాడు నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయినప్పుడు కర్నూలు రాష్ట్ర రాజధానిగా ఏర్పాటైంది. ఆపై హైదరాబాద్ విలీనం కావడంతో కర్నూలు రాజధానిని 'సీమ' వాసులు త్యాగం చేశారు. దీంతో హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలని మద్రాసులోని కాశీనాథుని నాగేశ్వరరావు ఇంట్లో పెద్దమనుషులు ఒప్పందం చేసుకున్నారు. అయితే అనంతరం ఏ ప్రభుత్వం కూడా హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేసే దిశగా చర్యలకు ఉపక్రమించలేదు. హైదరాబాద్‌లోనే హైకోర్టును నెలకొల్పారు. అనంతరం 2014లో రాష్ట్ర విభజన సమయంలో రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేయాలని లేదంటే హైకోర్టును ఏర్పాటు చేయాలని సీమ వాసులు డిమాండ్ చేశారు. అయితే నాడు చంద్రబాబు సర్కారు ఎవరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా అమరావతిని రాజధానిగా ప్రకటించి అక్కడే హైకోర్టు ఏర్పాటుకు ఏకపక్ష నిర్ణయం తీసుకుంది.

ఏడు దశాబ్దాల అన్యాయాన్ని సరిదిద్దుతూ..

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని భావించారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారు. జగన్నాథగట్టుపై 273 ఎకరాల భూమిని కూడా కేటాయించారు. అందులో హైకోర్టు, నేషనల్ లా యూనివర్సిటీ 43 ట్రిబ్యునల్స్‌తో జ్యుడిషియల్ సిటీ నెలకొల్పాలని సంకల్పించారు. అనివార్య కారణాలతో జాప్యం జరగడంతో లోకాయుక్త, హెచ్‌ఆర్సీ, ఏపీఈఆర్సీ, వక్ఫ్‌ట్రిబ్యునల్, సీబీఐ కోర్టులను ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో జ్యుడీషియల్ సిటీ ఏర్పాటైతే కర్నూలు అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని భావించారు. లా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ కూడా చేశారు. అయితే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైన ఐదు నెలలకే 'సీమ'కు తీవ్ర నష్టం వాటిల్లేలా మరో చర్యకు ఉపక్రమించి కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేసింది.

తీరని ద్రోహం



ఒక రేషన్ షాపునే ఒక వీధిలో నుంచి మరో వీధిలోకి మారుస్తామంటే ఒప్పుకోరు. అలాంటిది ఏకంగా రాజధానిని 'సీమ' త్యాగం చేసింది. హైకోర్టు బెంచ్ కాదు ప్రిన్సిపల్ బెంచ్ ఏర్పాటు చేయాలి. హైకోర్టును నిర్మించాలి. శ్రీబాగ్ ఒప్పందం ఇదే! వేర్పాటువాదం రాగానే బెల్గాంలో అసెంబ్లీ నిర్మించారు. శీతాకాల సమావేశాలు అక్కడ జరుగుతున్నాయి. మద్రాసు నుంచి విడిపోయినప్పుడు వైజాగ్‌లో విశ్వవిద్యాలయం, కర్నూలులో రాజధాని, గుంటూరులో హైకోర్టు నిర్మించాలని నిర్ణయించారు. 'సీమ' అవసరాలు తీరిన తర్వాతే కృష్ణా జలాలను ఇతర ప్రాంతాలు వినియోగించుకోవాలని చెప్పారు. ఇందులో ఏ ఒక్కటీ అమలు కాలేదు. ఏడు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉంది. మా ప్రభుత్వం అధికారంలో ఉండగా హైకోర్టు నిర్మించేందుకు సిద్ధమైతే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం బెంచ్ ఏర్పాటు అంటూ తీరని ద్రోహం చేస్తోంది.

– బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి

ఏకపక్ష నిర్ణయాలతో మళ్లీ విభేదాలు



విభజన తర్వాత రాజధాని ప్రకటన సమయంలో ప్రజాభిప్రాయాన్ని తీసుకోకుండా అమరావతిని ఏకపక్షంగా ప్రకటించారు. రాజధాని, హైకోర్టు రెండింటిలో ఒకటి సీమలో ఏర్పాటు చేయాలని గతంలో ఒప్పందం జరిగింది. రాజధానిని అమరావతిలో పెడుతున్నారు. మరి హైకోర్టును కర్నూలులో పెట్టకపోవడం దారుణం. బెంచ్ ఏర్పాటు చేయడమంటే 'సీమ'కు ప్రత్యక్షంగా ద్రోహం చేయడమే. రాజధాని, హైకోర్టు ఏర్పాటుపై మరోసారి చర్చ జరగాలి. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. ఏకపక్ష నిర్ణయాలతో ప్రాంతీయ విభేదాలు తలెత్తి మళ్లీ వేర్పాటువాదం బలపడే ప్రమాదం ఉంది.

– శైలజానాథ్, మాజీ మంత్రి

చ..చ..చ.. చలి

● రాత్రి 8 గంటల నుంచే చలి.. ఉదయానికి మరింత తీవ్రత
● 15 డిగ్రీలకు పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు



ఉదయం పొగమంచు కప్పేసిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కొద్ది రోజులుగా ఉమ్మడి జిల్లాలో చలి గజగజ వణికిస్తోంది. డిసెంబరు నెల రాక ముందే చలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రానున్న రోజుల్లో చలి ప్రభావం ఏ విధంగా ఉంటుందో ఊహించడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. సంక్రాంతి సమయానికి రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉంది. వాయువ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆనుకొని ఉన్న ప్రాంతాల మీదుగా అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 కి.మీ ఎత్తు విస్తరించి.. ఎత్తుకు వెళ్లే కొద్ది నైరుతి దిశగా వంగి ఉంది. వచ్చే రెండు రోజుల్లో వాయువ్య దిశకు కదిలే అవకాశం ఉంది. ఈ ప్రభావం వల్ల చలి తీవ్రత మరింత పెరుగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. సాధారణంగా ఈ సమయంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 17 నుంచి 18 డిగ్రీల వరకు నమోదు అవుతాయి. నవంబరు నెల ద్వితీయ పక్షంలోనే ఉష్ణోగ్రతలు పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. కర్నూలు జిల్లాలో 15 నుంచి 16 డిగ్రీలు, నంద్యాల జిల్లాలో 15 నుంచి 17 డిగ్రీల వరకు మాత్రమే నమోదు అవుతున్నాయి. రాత్రి 8 గంటలకే చలి తీవ్రత పెరుగుతుండటంతో దుప్పటి కప్పుకోవాల్సి వస్తోంది. ఉదయానికి చలి ప్రభావం మరింత పెరుగుతోంది. ఉదయం 7 గంటల వరకు కూడా చలి పులి భయంతో బయటకి రాలేని పరిస్థితి ఏర్పడింది. చలి ప్రభావం పెరుగుతుండటంతో అనారోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఊపిరితిత్తులు, అలర్జీ వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. ఎముకలు కొరికే చలి వల్ల వృద్ధులు, చిన్న పిల్లలు అల్లాడుతున్నారు. గురువారం కర్నూలు జిల్లాలోని అత్యల్పంగా ఆలూరు, గూడూరుల్లో రాత్రి ఉష్ణోగ్రత 15 డిగ్రీలు మాత్రమే నమోదైంది. ఎమ్మిగనూరులో 15.1, కోసిగిలో 15.6, ఆదోనిలో 15.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. నంద్యాల జిల్లాలో అత్యల్పంగా మిడుతూరులో 15.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్యాపిలిలో 15.8, గడివేములలో 15.9, డోన్‌లో 16.2, జూపాడుబంగ్లాలో 16.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఏర్పడింది.

25,26 తేదీల్లో బాల్ రంగ్ ఉత్సవాలు

కర్నూలు సిటీ: విద్యార్థినీ విద్యార్థుల్లో జాతీయ సమగ్రతను పెంపొందించడానికి ఈ నెల 25, 26 తేదీల్లో బాల్ రంగ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షంషుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూల్, మున్సిపాలిటీ, కేజీబీవీ స్కూళ్లల్లో చదువుతూ 13 నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. తప్పెటగుళ్ల, కర్రసాము, చెంచులపేట, థింసా, జాలరి, బంజారి వంటి జానపద కళారూపాల్లో పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్, పూర్తి వివరాలకు డైట్ లెక్చరర్ సి.ప్రభాకర్ బాబు 8985126758ను సంప్రదించాలన్నారు.

పెళ్లి వేడుకలో విషాదం

● పెళ్లి కుమారుడికి గిఫ్ట్ ఇస్తూ కుప్పకూలిన మిత్రుడు
● గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించిన వైద్యులు
● మృతుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



వంశీకుమార్ (ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో గురువారం జరిగిన ఓ పెళ్లిలో విషాదం చోటు చేసుకుంది. మిత్రులతో కలిసి పెళ్లి జంటకు గిఫ్ట్ ఇచ్చే సమయంలో ఓ యువకుడు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. అప్పటి వరకు సందడిగా ఉన్న పెళ్లి మండపం ఒక్కసారిగా నిశబ్దం అలుముకుంది. పెనుమాడ గ్రామానికి చెందిన శివయ్యగౌడ్ కుమారుడు రవికిరణ్ గౌడ్, గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామానికి చెందిన వంశీకుమార్ (28) ఇద్దరు స్నేహితులు. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. స్నేహితుడు రవికిరణ్‌గౌడ్ పెళ్లికి పెనుమాడ గ్రామానికి వచ్చాడు. స్నేహితులతో కలిసి తలంబ్రాలు అయిన తరువాత తెచ్చిన గిఫ్ట్ ఇచ్చేందుకు వేదికపైకి చేరుకున్నాడు. ఇంతలోనే వంశీకుమార్ పక్కకు ఒరుగుతుండగా స్నేహితులు పట్టుకున్నారు. వెంటనే మెరుగైన వైద్యం కోసం డోన్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పెళ్లి వేడుకలో విషాదం నెలకొంది. మృతుడి తల్లిదండ్రులు చిన్నమాదన్న, జయమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన వంశీకుమార్ బెంగళూరులో అమెజాన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబానికి అండగా ఉన్న కుమారుడు అకాల మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం

● జాయింట్ కలెక్టర్ నవ్య



మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల కింద రుణాల పంపిణీ చేస్తున్న జేసీ

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డుల కింద జిల్లా మత్స్యకార కో–ఆపరేటివ్ సొసైటీలోని 48 మంది సభ్యులకు రూ.12.85 లక్షల రుణాలు పంపిణీ చేశారు. ఉత్తమ మహిళ కో–ఆపరేటివ్ సభ్యురాలుగా రాణిస్తున్న సునీతమ్మను, మార్కెటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్న కౌసల్యను జేసీ సత్కరించారు. త్రీవీలర్‌పై చేప ఉత్పత్తులను విక్రయిస్తున్న భారతి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మత్స్యకారురాలుగా ఎంపిక కావడం పట్ల అభినందనలు తెలిపారు. అనంతరం జేసీ మాట్లాడుతూ... మత్స్యకారుల అభివృద్ధికి ఇటు ప్రభుత్వం, అటు బ్యాంకులు సహకరిస్తుండటం శుభపరిణామమన్నారు. కర్నూలు నగరానికి దగ్గరగా ఉన్న హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చేపలను ఎగుమతి చేయడం ద్వారా మంచి లాభాలు ఉంటాయని చెప్పారు. అంతకు ముందు జిల్లా మత్స్య శాఖ అధికారిణి శ్యామల.. జిల్లాలోని చేపల చెరువులు, చేపల పెంపకం, అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, కెనరాబ్యాంకు ఆర్ఎం సుశాంత్‌కుమార్, డీసీఓ రామాంజనేయులు, మత్స్యశాఖ అధికారులు సంధ్యారాణి, శేఖర్, మత్స్య సహకార సంఘంసభ్యులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం చేయొద్దు

● అధికారులకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశం



కర్నూలు(సెంట్రల్): పరిశ్రమల స్థాపనకు అనుమతుల మంజూరులో జాప్యం లేకుండా గడువులోపు ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీయల్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...సింగిల్ డెస్కులో వచ్చిన దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్, భూగర్భ జలాలు తదితరశాఖలకు సంబంధించి 16 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని గడువులోపు పరిశీలించాలని ఆదేశించారు. త్వరలో జరిగే ఎంఎస్ఎంఈ సర్వే కోసం 27వ తేదీన మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలకు, 28వ తేదీన సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎంకు సూచించారు. కల్లూరు ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో మౌలిక వసతులైన నీరు, డ్రైనేజీలు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా జైరాజ్ ఇస్పాత్ ఫ్యాక్టరీ కోసం బ్లాస్టింగ్‌లు చేయాలన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు సంబంధించి 39 క్లెయిమ్‌లకు 3.48 కోట్ల రుణాల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎం అరుణ, ఏపీఐఐసీ జీఎం శ్రీనివాసరెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్, మత్స్యశాఖ అధికారి శ్యామల, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవిపాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు (టౌన్): రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో కర్నూలు జ్యువెలరీ షాపులు, షాపింగ్ మాల్స్, లాడ్జీల యాజమాన్యాలతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. డిజిటల్ అరెస్టులు ఉండవని, అలాంటి వాటిని నమ్మ వద్దని సూచించారు. షాపింగ్ మాల్స్, జ్యువెలరీ, లాడ్జీల ముందు మన్నిక కలిగిన సీసీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాకు త్వరలో 100 ఎలక్ట్రికల్ బస్సులు వస్తున్నాయన్నారు. తద్వారా కర్నూలు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రసాద్, కేశవరెడ్డి, అబ్దుల్ గౌస్, మన్సూరుద్దీన్, శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐలు ఖాజవలి, వ్యాపారులు పాల్గొన్నారు.

అతని టార్గెట్ ఎద్దులే!

● విషం పెట్టి చంపేస్తున్న వైనం
● సీసీ కెమెరా పుటేజీలో పట్టుబడిన అదే గ్రామానికి చెందిన వ్యక్తి



పశువులకు విష గుళికలు పెట్టేందుకు నిందితుడు వెళ్తుండగా సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం



రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న కమలాపురం గ్రామస్తులు

డోన్ రూరల్: మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో కొన్నేళ్లుగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందుతున్న ఎద్దుల మిస్టరీ ఎట్టకేలకు వీడింది. పశువుల మరణం వెనుక అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. సీసీ కెమెరాలో పట్టుబడటంతో గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. బుధవారం గ్రామానికి చెందిన రైతు బుగ్గన శివరామిరెడ్డి ఎద్దు ఒకటి మృత్యువాత పడింది. అయితే అనుమానంతో పశువుల పాకలోని సీసీ కెమెరా పుటేజీని గురువారం ఆయన పరిశీలించాడు. అదే గ్రామానికి చెందిన శంకరాచారి బుధవారం మధ్యాహ్నం సమయంలో ఎవరూ లేనిది చూసుకుని గోడ దూకి లోపలికి వచ్చి ఎద్దుకు విష గుళికలు తినిపించినట్లు గుర్తించాడు. ఇప్పటి వరకు గ్రామంలో ఎద్దుల మృత్యువాతకు అతనే కారణమని గ్రామస్తులు భావించి పోలీసులకు అప్పగించారు. అయితే, శంకరాచారి ఎద్దులను ఎందుకు టార్గెట్ చేశారో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మూడేళ్లలో 64 పశువులు మృతి...

కమలాపురం గ్రామ ప్రజలకు అధిక శాతం వ్యవసాయమే ఆధారం. ఈ మేరకు రైతులు ఎద్దులను పోషిస్తున్నారు. కాగా మూడేళ్లుగా గ్రామంలో ఇప్పటి వరకు 64 ఎద్దులు మృతి చెందాయి. అందరూ అనారోగ్యం, విష ఆహారం తిని ఎద్దులు చనిపోయాయని భావించారు. గ్రామానికి చెందిన బుగ్గన శివరామిరెడ్డి ఇంట్లోనే 14 ఎద్దులు మృత్యువాత పడ్డాయి. ఎద్దుల మృతికి గ్రామానికి చెందిన శంకరాచారి కారణమని తెలియడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఇతను గ్రామంలో వడ్రంగి పని చేస్తూ జీవిస్తున్నాడు. రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు తయారు చేసేది ఇతనొక్కడే. అలాంటిది మూగజీవాలను ఎందుకు బలితీసుకుంటున్నాడో అర్థం కావడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు తనకేమి తెలియదని బుకాయిస్తున్నట్లు తెలుస్తోంది. పశువులకు విషపు గుళికలు పెట్టి చంపేస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతులు గురువారం డోన్ రూరల్ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు శంకరాచారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు.

డాటా సేకరణ.. కూటమి కుట్ర!

- సచివాలయ ఉద్యోగుల ద్వారా బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్‌పై ఆరా
- రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలకు పౌరులను దూరం చేసే యత్నం

కర్నూలు(అగ్రికల్చర్): పౌరుల సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం రహస్యంగా సేకరిస్తోంది. ప్రజల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది. ఈ ప్రక్రియ సచివాలయ ఉద్యోగుల ద్వారా కొద్ది రోజులుగా జరుగుతోంది. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడి బ్యాంకు/పోస్టల్ అకౌంట్లను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) అనుసంధానం చేయడంతోపాటు ప్రతి హౌస్‌ను జియో ట్యాగింగ్ చేయించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిపై ఎలాంటి ప్రచారం లేదు. ఇదంతా రహస్యంగా జరుగుతోంది. 2014–15 నుంచి 2018–19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ చేపట్టిన ప్రజాసాధికార సర్వే కారణంగా నేటికీ వేలాది కుటుంబాలు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందలేకపోతున్నాయి. ప్రజాసాధికార సర్వేలో మీది ఉమ్మడి కుటుంబం మీ కుటుంబంలో సంపాదించే వారు ఉన్నారు.. ఆదాయపు పన్ను కూడా కడుతున్నారంటూ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం చేసింది. తాజాగా పౌరుల బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో లింక్ చేయడంతోపాటు మొత్తం హౌస్ హోల్డ్ మెంబర్స్ వివరాలను ఎన్‌పీసీఐ డేటాతో వెరిఫై చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షేమ పథకాల ఊసే లేకపోయినా..

ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదు. ఈ దిశగా కనీస చర్యలు కూడా లేవు. ఎన్నికల సమయంలో సూపర్–6తో పాటు ఇతరత్రా ఎన్నో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చింది. సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టినపుడు బ్యాంకు ఖాతాల వివరాలను వెరిఫై చేయవచ్చు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల సంక్షేమ పథకాలను డీబీటీ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలకు ప్రయోజనాలను విడుదల చేసింది. ఇప్పటికే సంక్షేమ పథకాలకు అర్హులైన వారి డేటా ప్రభుత్వం వద్ద ఉంది. కూటమి ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి అంటే ఉద్యోగులు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక వేత్తల బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో అనుసంధానం చేయడంపై దృష్టి సారించింది. ఇప్పటికి జిల్లాలు, మండలాలు, గ్రామాల వారిగా ఎన్‌పీసీఐతో అనుసంధానం లేని బ్యాంకు ఖాతాల వివరాలను గ్రామ, వార్డు సచివాలయాలకు పంపంది. సచివాలయ ఉద్యోగులు వీరిని సంబంధిత బ్యాంకులకు పంపి ఎన్‌పీసీఐతో లింక్ చేయించే కార్యక్రమాన్ని అప్పగించింది.



తుగ్గలి మండలం పి.కొత్తూరులో ఎన్‌పీసీఐ లింక్ చేస్తున్న పోస్టల్ సిబ్బంది

ప్రభుత్వం వద్ద పౌరుల వివరాలు

పౌరులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఇళ్ల వివరాలు తదితర సమస్త వివరాలు ప్రభుత్వం తన దగ్గరు ఉంచుకుంటోంది. ఈ వివరాల ఆధారంగా ప్రజలను ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సోషల్ సెక్యూరిటీ పెన్షన్లకు దూరం చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో బాగంగానే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాను ఎన్‌పీసీఐతో లింక్ చేయించడం, మొత్తం హౌస్ హోల్డ్ మెంబర్స్ వివరాలను ఎన్‌పీసీఐ డేటాతో వెరిఫై చేయిస్తుండటాన్ని పరిశీలిస్తే లక్షల కుటుంబాలను రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలకు దూరం చేసేందుకేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పౌరుల సమస్త సమాచారాన్ని ప్రభుత్వం గుప్పిట్లో ఉంచుకొని ప్రజలపై ఆధిపత్యం చెలాయించేందుకేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో 4,90,432 బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐతో లింక్ లేదు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,90,432 బ్యాంకు ఖాతాలకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో అనుసంధానం కాలేదు. కర్నూలు జిల్లాలో 2,93,619, నంద్యాల జిల్లాలో 1,96,813 ఖాతాలకు ఎన్‌పీసీఐతో అనుసంధానం లేదని ప్రభుత్వం గుర్తించింది. ఎన్‌పీసీఐతో లింక్ చేయించే బాధ్యతను ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. ఇందులో ఉద్యోగులైన, సంపన్నులైన, వ్యాపార, వాణిజ్య వేత్తలున్నా.. బ్యాంకు ఖాతాలను మాత్రం ఎన్‌పీసీఐతో లింక్ చేయించాల్సిందే. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 22,415, నంద్యాల జిల్లాలో 14,032 ఖాతాలకు ఎన్‌పీసీఐతో అనుసంధానం చేయించినట్లు తెలుస్తోంది.

ప్రతి హౌస్‌హోల్డ్‌కు జియో ట్యాగింగ్

ప్రతి హౌస్‌హోల్డ్‌ను జియోట్యాగింగ్ చేయడం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్లతో ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేయించింది. నేడు వలంటీర్లు లేరు. అన్ని రకాల సేవలు సచివాలయ ఉద్యోగుల ఉద్యోగులపై ఉంది. మ్యాపింగ్ అయిన ఇళ్లను జియోట్యాగింగ్ చేయడంతోపాటు ఇళ్లు మారిన వారిని మ్యాపింగ్ చేయడంతోపాటు జియోట్యాగింగ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13,28,832 హౌస్‌హోల్డ్ ఉన్నాయి. ఇందులో కర్నూలు జిల్లాలో 7,31,591, నంద్యాల జిల్లాలో 5,97,365 హౌస్‌హోల్డ్ ఉన్నాయి. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 36903, నంద్యాల జిల్లాలో 95,241 హౌస్‌హోల్డ్స్‌ను జియోట్యాగింగ్ చేస్తారు. జియోట్యాగింగ్‌లో ఇంటి నెంబరుతోపాటు పెంకుటిల్లు/మట్టిమిద్దె/ఆర్‌సీ ఇల్లు ఇలా ఎలాంటి ఇల్లు అనే దానిని కూడా ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేసి ఆన్‌లైన్‌లో పెడతారు. పౌరుల బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో లింక్ చేయడంతోపాటు మొత్తం హౌస్ హోల్డ్ మెంబర్స్ వివరాలను ఎన్‌పీసీఐ డేటాతో వెరిఫై చేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం ముమ్మరం చేసింది.

వీఏఏ, వీఎస్ఏ, వీహెచ్‌ఏలపై పెరిగిన భారం

వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి గ్రామ స్థాయిలో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏ, ఏహెచ్ఏలు పనిచేస్తున్నారు. వీరు కూడా సచివాలయ ఉద్యోగులే అయినప్పటికీ రైతు సేవా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నారు. వీరిపై విపరీతమైన ఒత్తిడి ఉంది. వీరికి అత్యవసర సేవలకు సంబంధించిన వారుగా గుర్తింపు ఉంది. ఒకవైపు ఈ–క్రాప్ బుకింగ్, కరువు మండలాల్లో పంట నష్టంపై ఎన్యూమరేషన్, పింఛన్ల పంపిణీతో సహా అనేక కార్యక్రమాలతో సతమతమవుతున్నారు. సంబంధిత డిపార్టుమెంట్ పనులే ఎక్కువగా ఉన్నాయి. అదనంగా ఇతర శాఖల పనులు కూడా అప్పగిస్తుండటం పట్ల ఒత్తిడికి గురవుతున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన సచివాలయ ఉద్యోగులకు ఇతర శాఖల పనులు అప్పగించరాదనే నిబంధన ఉన్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీని పట్ల ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

విద్యుత్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారుల విచారణ



విచారణ చేస్తున్న ఎస్‌ఐ మౌలానీ

డోన్ టౌన్: అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల బుధవారం విద్యుత్ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. అక్కడ పని చేసి బదిలీ అయిన అధికారి మహిళా ఉద్యోగినులను లైంగికంగా వేధిస్తుండటంతోపాటు మిగతా సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తానని డబ్బు కూడా తీసుకున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్‌ఐ మౌలానీ విచారణ చేపట్టారు. కార్యాలయానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. అధికారి గెస్ట్ హౌస్‌గా ఉపయోగించుకుంటున్నట్లు చెబుతున్న గదిని కూడా తనిఖీ చేశారు. వాచ్‌మెన్, అటెండర్ నుంచి వివరాలు ఆరా తీశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతానని విజిలెన్స్ ఎస్‌ఐ తెలిపారు. ఎస్‌ఐ వెంట ఏఈఈ నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయినికి సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ మహిళా ఉద్యోగినికి టోకరా వేయడానికి గురువారం సైబర్ నేరగాళ్లు విఫలయత్నం చేశారు. పాకిస్తాన్‌కు చెందిన సిమ్ నెంబర్లు 923231025122, 923131491446తో ఇద్దరు సైబర్ నేరగాళ్లు 10 సార్లు ఉద్యోగినికి వాట్సాప్ కాల్స్ చేశారు. తాము సీబీఐ అధికారులమని, మీ కూతురికి డ్రగ్స్ కేసులతో సంబంధం ఉందని, వదిలేయాలంటే రూ.30 వేలు ఫోన్‌పే చేయాలని డిమాండ్ చేశారు. అనుమానం వచ్చి ఆమె ఫోన్ కట్ చేసి కూతురికి కాల్ చేసింది. అలాంటిదేమీ లేదని, అది సైబర్ నేరగాళ్ల పనై ఉంటుందని కూతురు చెప్పడంతో ఆమె ఊపిరి పీల్చుకుంది.

ప్రాక్టికల్స్‌కు అనుమతులు

కర్నూలు సిటీ: ప్రైవేట్ డీఎల్‌ఈడీ కాలేజీల్లో 2018–20 విద్యా సంవత్సరానికి స్పాట్, మేనేజ్‌మెంట్ కోటాలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు సెకెండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని ప్రభుత్వ డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షంషుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ప్రైవేట్ కాలేజీల ప్రిన్సిపల్‌తో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఎడ్ల బండిపై నుంచి కింద పడి వ్యక్తి మృతి



గోపాల్ (ఫైల్)

వెలుగోడు: గుంతకందాల గ్రామానికి చెందిన కోళ్ల బోయిన గోపాల్(54) ఎడ్ల బండి పైనుంచి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గురువారం ఎడ్ల బండిపై ఎరువుల బస్తాలు వేసుకొని తన పంట పొలానికి వెళ్లాడు. అక్కడ ఎరువుల బస్తాలు దించే క్రమంలో ఎద్దుల ముందుకు కదలడంతో గోపాలు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెలుగోడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం నంద్యాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బాలిక మృతదేహం లభ్యం

వెలుగోడు: అయ్యవారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న నిప్పుల వాగులో ఈనెల 18న బాలిక గల్లంతైన విషయం తెలిసిందే. మూడు రోజులు గాలింపు చర్యల అనంతరం గురువారం బండిఆత్మకూరు మండలంలోని ఎరగ్రుంట్ల గ్రామం రమణారెడ్డి పొలంలో జమ్ము గడ్డి వద్ద బాలిక మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించి బాలిక మృతదేహాన్ని బయటికి తీశారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాలకు తరలించారు.

ఎవరెస్టు అధిరోహకుడికి కలెక్టర్ అభినందన



సురేష్‌బాబును అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన గోనెగండ్లకు చెందిన సురేష్‌బాబును కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభినందించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆయనకు కలెక్టర్ శాలువా కప్పి సన్మానం చేశారు. 17 ఏళ్లకే సురేస్‌బాబు ఎవరెస్టు ఎక్కడం గొప్ప విషయమన్నారు. కాగా గతంలో సురేష్‌బాబు కిలిమంజారో, ఎల్బ్రస్, కోసియాజుకు, అఖింగువ పర్వత శిఖరాలను అధిరోహించి తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరును లిఖించుకున్నారని కలెక్టర్ వివరించారు.

మల్లన్న సేవలో మాజీ మంత్రి ఆర్కే రోజా



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. గురువారం మల్లన్న దర్శనార్థం ఆమె శ్రీశైలం చేరుకున్నారు. మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి



పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన పీఠాధిపతికి రాజగోపురం వద్ద ఈఓ ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో పీఠాధిపతి గౌరవార్థం పండితులు వేదగోష్టి నిర్వహించారు. ఆలయ అధికారులు పీఠాధిపతిని సత్కరించారు.

బైక్‌ను ఢీకొన్న బొలేరో.. యువకుడి మృతి



ఈరన్న(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కలుగొట్ల రోడ్డు వద్ద పెట్రోల్ బంక్ ఆవరణలో బైక్‌ను బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. నందవరం మండలం కనకవీడు గ్రామానికి బోయ ఈరన్న(26), నాగరాజు బైక్‌పై ఎమ్మిగనూరుకు వచ్చారు. మిరప పైరుకు పిచికారీ చేసేందుకని పురుగు మందు తీసుకుని స్వగ్రామానికి బయలుదేరారు. కలుగొట్ల రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద బైక్‌కు పెట్రోల్ వేయించుకుని ముందుకు కదులుతుండగా పక్కనే డీజిల్ వేయించుకుంటున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న ఈరన్న, డ్రైవింగ్ చేస్తున్న నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఈరన్న మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మావతి, కుమార్తెలు సంగీత, జ్యోతి, వెన్నల, కుమారుడు మహేష్ ఉన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

26న రైతు, కార్మిక సంఘాల మహా ప్రదర్శన



మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): ఈనెల 26న కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా పిలుపు మేరకు చేపట్టే కార్మిక, రైతు సంఘాల మహాప్రదర్శను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప కోరారు. జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శనలు ఉంటాయన్నారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమంలో చనిపోయిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని చెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీ మోసం చేశారన్నారు. 44 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తేవడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులను కార్పొరేటర్లకు ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారన్నారు. నిధులు, పని దినాలు తగ్గించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్రం కుట్రపన్నిందన్నారు. సమావేశంలో నాయకులు జి.చంద్రశేఖర్, టి.రామాంజనేయులు, ఈశ్వర్, డీసీ రహమాన్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ బిందు మాధవ్



రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

కర్నూలు (టౌన్): అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీ ఎత్తున బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్ గురువారం వెల్లడించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కొందరు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. గ్రూపులుగా విడిపోయి దేశంలోని పలు చోట్ల చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నారు. ఈక్రమంలో కర్నూలు జిల్లాలోను రెండు గ్రూపులు చేరీలకు పాల్పడ్డాయి. దీంతో ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు.. ఆదోనిలోని తిమ్మారెడ్డి బస్టాండ్ కొందరిని, ఆత్మకూరులోని సిద్దాపురం వద్ద ఉన్న ఆడవుల్లో కొందరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరాలు ఒప్పుకున్నారు. రెండు ఘటనల్లో 13 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 478.7 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.8.4 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

అంతర్రాష్ట్ర ముఠా నేర నేపథ్యం

అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు రద్దీగా ఉండే తిరునాళ్లు, బహిరంగ సభలు, జాతరలు, పాదయాత్రలు, దేవుని ఊరేగింపులు, ఉత్సవాలు, బ్యాగ్ లిఫ్టింగ్, పిక్ ప్యాకెటింగ్, అటెన్షన్ డైవర్షన్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. జిల్లాలోనే గాకుండా అయోధ్య, వారణాసీ, కలకత్తా, గోవా, ముంబయి, బెంగళూరు, హైదరాబాదు, తిరుపతి, శ్రీశైలం వంటి పుణ్య క్షేత్రాల్లోనూ ఈ ముఠా చోరీలకు పాల్పడినట్లు కేసులు నమోదయ్యాయి.

రిమాండ్‌కు 13 మంది.. పరారీలో ఇద్దరు

అరెస్ట్ అయిన నిందితులు సముద్రాల పృథ్వీరాజ్, దండగల సరోజ, మాణిక్యాల విష్ణు, సముద్రాల ఏసుబాబు, సమురాళ్ల జగదీష్, గుంజా రాఘవ, సముద్రాల డేవిడ్, రామలక్ష్మి, బైరాపురం షేక్ దావుద్ బాషా, రమణమ్మ, గిడ్డన్న, బోయ ఆకుల వీరేష్, సయ్యద్ మహమ్మద్‌లను రిమాండ్‌కు తరలించారు. ఇదే ముఠాలోని మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఆదోని డీఎస్పీ సోమన్న, సీఐలు శ్రీరామ్, కేశవరెడ్డి, ప్రసాద్, అబ్దుల్ గౌస్, మన్సురుద్దీన్, శివశంకర్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



విజయమ్మ(ఫైల్)

జూపాడుబంగ్లా: మండల పరిధిలోని కనకయ్యకొట్టాలకు చెందిన బండారి విజయమ్మ(42) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. కనకయ్యకొట్టాల గ్రామానికి చెందిన బండారి విజయమ్మనకు వెలుగోడు మండలం రేగడగూడూరుకు చెందిన గద్దా సుధాకర్‌కు గతంలో వివాహం కాగా వీరికి కూతురు ఉంది. కాగా 12 ఏళ్ల క్రితం వీరు విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి విజయమ్మ కనకయ్యకొట్టాల గ్రామంలోని సోదరుడు ప్రవీణ్‌కుమార్ వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. ఈనెల 19న రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తుండగా విజయమ్మ ఎవ్వరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఉదయం తెలిసిన చోట్ల, బంధువుల వద్ద ఆరా తీయగా ఆచూకీ లేకపోవడంతో సోదరుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలకల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సి.బెళగల్: ఇటీవల తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహించిన పలు పోటీల్లో మండలంలోని పోలకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం రమ తెలిపారు. గురువారం విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహించిన కథల పోటీలో తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఉషారాణి రాసిన 'వర్ష' కథకు బహుమతి లభించిందన్నారు. నిర్వాహకులు రూ.500 నగదు బహుమతితోపాటు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం, రూ.500 విలువ చేసే పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. చిత్రలేఖనం పోటీలో 6వ తరగతి విద్యార్థి పరశురాముడు ప్రతిభ కనబరిచి జ్ఞాపిక, ప్రశంసా పత్రం రూ.500 విలువ చేసే పుస్తకాలను దక్కించుకున్నాడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదు, షాహిదా, ఎలిజిబెత్ రాణి, రమాదేవి, కుసుమకుమారి, సూర్యనారాయణ, శాంతికుమారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చాగలమర్రి: మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో జాతీయ రహదారిపై రామయ్య డాబా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చిన్న బోధనం గ్రామానికి చెందిన చాకలి రాముడు(33), పెద్ద బోధనం గ్రామానికి చెందిన అంజి బైక్‌పై మద్దూరు గ్రామానికి ఓ శుభ కార్యం నిమిత్తం వెళ్లారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో రామయ్య డాబా వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో రాముడు అక్కడికక్కడే మృతి చెందగా, అంజి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఒంటరి జీవితం గడపలేక వ్యక్తి ఆత్మహత్య

గోస్పాడు: భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో జిల్లెల్ల గ్రామానికి చెందిన వెంకటరమణ(56) ఒంటరి జీవితం గడపలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. జిల్లెల్ల గ్రామానికి చెందిన వెంకటరమణ భార్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు నంద్యాలలో బీటెక్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈక్రమంలో వెంకటరమణ ఒంటరి జీవితం గడపలేక పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

- ముగ్గురు నిందితులు అరెస్ట్



మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, ఎస్‌ఐ ఇస్మాయిల్

ఎమ్మిగనూరు రూరల్: ఎక్సైజ్ పోలీసులు గురువారం భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. నందవరం మండలం జగ్గాపురం క్రాస్ రోడ్డు వద్ద తెల్లవారుజామున ఎక్సైజ్ ఎస్‌ఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. జగ్గాపురం గ్రామానికి చెందిన బోయ హరికృష్ణ, బోయ నాగర్జున, బోయ రంగన్న రెండు బైక్‌లపై 15 బాక్సుల్లో కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి రూ.57,600 విలువ చేసే 1440 కర్ణాటక ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్స్, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో నాగార్జున స్పృహతప్పి పడిపోవటంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

జాతీయ స్థాయి పోటీలకు నెహ్రూనగర్ విద్యార్థిని



షహనాజ్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్

పగిడ్యాల: ఈనెల 25 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించనున్న అండర్ -14 విభాగం జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థిని షహనాజ్ ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం విద్యార్థినిని ఫిజికల్ డైరెక్టర్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు స్వామినాథం, భాస్కర్, సురేష్, వెంకటనాగులుతో కలిసి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని వారు ఆకాంక్షించారు.



కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,637	6,534
పొద్దుతిరుగుడు	2,509	2,509
ఆముదం	5,280	5,715
వాము	12,269	20,960
ఉల్లి	495	4,509
ఎండుమిర్చి	1,699	15,009
శనగలు	6,119	6,119
కందులు	9,039	9,039
మొక్కజొన్న	2,149	2,211
మినుములు	2,600	8,129
కొర్రలు	2,091	2,841
సోయాచిక్కుడు	2,096	4,111
సజ్జలు	2,131	2,181

ఫోన్ నం : 08518–257204, 257661